క్లుప్తంగా

ఇంటింటికీ వెళ్లి పథకాలపై అవగాహన

● పార్టీ క్యాడర్‌కు మంత్రి పెద్దిరెడ్డి ఆదేశం



మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని కలిసిన మహమ్మదాలి తదితరులు

పుంగనూరు: వైఎస్సార్ సీపీ ప్రతినిధులుగా నియమితులైన ప్రతి ఒక్కరూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని, ప్రభుత్వ పథకాల గురించి ఇంటింటికీ వెళ్లి ప్రజలకు మరింత అవగాహన కల్పించాలని మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆదేశించారు. గురువారం పుంగనూరుకు చెందిన మహమ్మదాలీని పార్టీ పట్టణ ఉపాధ్యక్షుడిగా నియమించారు. అతడు మంత్రి పెద్దిరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. దీనిపై మంత్రి మాట్లాడారు. అన్ని వర్గాలకు సముచిత న్యాయం కల్పిస్తూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నియామకాలు చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో మైనారిటీ నాయకులు అస్లాం మురాది, అఫ్రీద్, మాలిక్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీపీ వితరణ



విరాళం అందజేస్తున్న ఎంపీపీ రెడ్డెప్ప

వి.కోట: పట్టణంలోని దుర్గామాత ఆలయ కమిటీ భవన నిర్మాణానికి ఎంపీపీ మొగసాల రెడ్డెప్ప రూ.లక్ష విరాళాన్ని గురువారం ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. తన వంతు సాయంగా దైవ కార్యానికి సాయం చేసినట్లు ఆయన చెప్పారు. కార్యక్రమంలో కమిటీ చైర్మన్ సుబ్రమణ్యంరాజు, సభ్యులు దామోదర్‌రెడ్డి, తుకారం, జగన్ పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టీల్ ప్లేట్లు



విద్యార్థులకు స్టీల్ ప్లేట్లు అందజేస్తున్న హెచ్‌ఎం

సోమల: మండలంలోని ఇరికిపెంట పంచాయతీ వడ్డిపల్లె ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు రూ.20 వేల విలువ చేసే 150 ప్లేట్లను పాఠశాల పూర్వ విద్యార్థి లక్ష్మీ ప్రసాద్ అందజేసినట్లు హెచ్‌ఎం సుబ్రహ్మణ్యం తెలిపారు. తన తల్లిదండ్రులు పగడాల రాజమ్మ, కృష్ణమూర్తి స్మారకార్థం గతంలో మూడు గదులకు గ్రిల్స్ ఏర్పాటు కోసం రూ.2 లక్షలు సైతం అతను ఖర్చు చేశారన్నారు. దాతకు ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జీసీకే ప్రసాద్, శివరాం, సురేంద్ర, హేమ, భ్రమరాంబ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాభివృద్ధికి..



విరాళం ఇస్తున్న జెడ్పీటీసీ శ్రీనివాసులు

శాంతిపురం: మండలంలో అబకలదొడ్డిలోని పురాతన సోమేశ్వరస్వామి అలయాభివృద్ధి కోసం జెడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాసులు రూ.51 వేల విరాళాన్ని సర్పంచ్ చిన్నప్ప, గ్రామస్తులకు అందజేశారు. ఆలయ పునర్నిర్మాణానికి సాయం చేయాలని గ్రామస్తులు కోరడంతో ఆయన స్పందించారు.

ఈరోజు

పింఛన్ల పెంపు మహోత్సవం

రామకుప్పం: స్థానిక పోలీస్‌స్టేషన్ సర్కిల్‌లో శుక్రవారం ఉదయం 10 గంటలకు పింఛన్ల పెంపు మహోత్సవ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రాధాకృష్ణ తెలిపారు. లబ్ధిదారులు, ప్రజాప్రతినిధులు, నేతలు హాజరు కావాలని కోరారు.

జగనన్న ఆరోగ్య సురక్ష

చౌడేపల్లె: మండలంలోని 29ఏ చింతమాకులపల్లెలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష–2 శిబిరం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సుధాకర్ తెలిపారు. సచివాలయ పరిధిలోని గ్రామాల ప్రజలు దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నంజంపేటలో..

సోమల: మండలంలోని నంజంపేటలో జగనన్న ఆరోగ్య సురక్ష 2 శిబిరాన్ని శుక్రవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ నాగరాజ ఓ ప్రకటనలో తెలిపారు. దీనిని సచివాలయ పరిధిలోని గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మామిడి రైతులకు అవగాహన సదస్సు

సదుం: మండలంలోని మామిడి రైతులకు శుక్రవారం ఉదయం 10 గంటలకు ఎంపీడీఓ కార్యాలయంలో ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు హార్టికల్చర్ ఆఫీసర్ సంతోషిణి తెలిపారు. మామిడి యాజమాన్య పద్ధతులపై శాస్త్రవేత్తలు అవగాహన కల్పిస్తారని చెప్పారు.

సోమల: స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం మధ్యాహ్నం 2 గంటలకు సోమల, చౌడేపల్లె మండలాలకు చెందిన మామిడి రైతులకు అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు ఉద్యానవనశాఖాధికారిణి సంతోషి కుమారి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. మామిడి పూత, పిందె దశలో పాటించాల్సిన యాజమాన్య పద్ధతులపై జిల్లా అధికారులు శిక్షణ ఇస్తారన్నారు. మామిడి రైతులు దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మాట నిలబెట్టుకున్న సీఎం



వి.కోట: సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న లబ్ధిదారులు

● పింఛన్ల పంపిణీలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి
● పలు మండలాల్లో పండుగ వాతావరణంలో పింఛన్లు అందజేత
● వైఎస్సార్ సీపీని మరోసారి ఆదరించాలని నేతల వినతి





సోమల: కొత్త పెన్షన్లు పంపిణీ చేస్తున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, సమావేశానికి హాజరైన లబ్ధిదారులు

సోమల: అర్హతే ప్రామాణికంగా కులమతాలకతీతంగా సంక్షేమ పథకాల ఫలాలు అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ అధ్యక్షతన పాత పింఛన్లతోపాటు కొత్తగా మంజూరైన పింఛన్లు, ఆరోగ్యశ్రీ కార్డులను పంపిణీ చేసి ఆయన మాట్లాడారు. మేనిఫెస్టోలో ఇచ్చిన మాట ప్రకారం సీఎం దశలవారీగా పెన్షన్ పెంచుతూ రూ.3 వేలు చేశారని అన్నారు. గతంలో చంద్రబాబు రూ.వెయ్యి ఇచ్చేవారని, అది కూడా కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరిగి తెచ్చుకునేవారని, వైఎస్సార్ సీపీ పాలనలో అలాంటి పరిస్థితి లేదన్నారు. నాలుగున్నరేళ్ల పాలనలో ప్రతి కుటుంబానికి రూ.50 వేల నుంచి రూ.12 లక్షల వరకు లబ్ధి చేకూరిందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నాగరాజ, వైస్ ఎంపీపీలు ప్రభాకర, సయ్యద్ బాషా, ఏఎంసీ మాజీ చైర్మన్లు అమాస మోహన్, నాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గంగాధరం, జేసీఎస్ మండల కన్వీనర్ మంజునాథ, జిల్లా కార్యదర్శి శీలం భాస్కర్, నాగభూషణం రెడ్డి, బెంగళూరు సాంబయ్య, శ్రీరాములు, వెంకటరమణ, మొగిళప్పగారి శ్రీనివాసులు, బగ్గిడి నాగరాజ, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

పుంగనూరులో..

పుంగనూరు: మండలంలోని సామాజిక పింఛనుదారులకు గురువారం మండల పరిషత్ కార్యాలయంలో నూతన పెన్షన్లను పీకేఎం ఉడా చైర్మన్ వెంకటరెడ్డి యాదవ్‌తో కలసి ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి పంపిణీ చేశారు. ఎంపీపీ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాల క్యాలెండర్ ప్రకారం పథకాలను అమలు చేస్తున్నారని, లబ్ధిదారులు, ప్రజలు మరోసారి ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని కోరారు. మాజీ ఎంపీపీ నరసింహులు, పార్టీ మండల అధ్యక్షుడు కొత్తపల్లె చెంగారెడ్డి, సచివాలయాల కన్వీనర్ రాజశేఖర్‌రెడ్డి, ఎంపీటీసీలు, సర్పంచులు, వలంటీర్లు పాల్గొన్నారు.

సదుంలో..

సదుం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం నూతన పింఛన్లతోపాటు కొత్త ఆరోగ్యశ్రీ కార్డులను జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్‌రెడ్డి, ఎంపీపీ ఎల్లప్ప పంపిణీ చేసి మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో మళ్లీ వైఎస్సార్ సీపీని ఆదరించాలని కోరారు. కొత్తగా 90 పింఛన్లు మంజూరు అయినట్టు ఎంపీడీఓ వరప్రసాద్ తెలిపారు. వైస్ ఎంపీపీ ధనుంజయరెడ్డి, జేసీఎస్ ఇన్‌చార్జి ప్రకాష్‌రెడ్డి, పార్టీ మండల కన్వీనర్ రెడ్డెప్పరెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ శివారెడ్డి, బోయకొండ ఆలయ మెంబర్ భాస్కర్‌రెడ్డి, కో–ఆప్షన్ సభ్యుడు ఇమ్రాన్, డాక్టర్లు గిరీషా, చరణ్, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

పులిచెర్లలో..

పులిచెర్ల(కల్లూరు): మండలంలోని మంగళంపేట, కల్లూరు, రాజులపల్లె, అయ్యావాండ్లపల్లె, దిగువపోకల వారిపల్లె, చల్లావారిపల్లె, రాయవారిపల్లె పంచాయతీలలో గురువారం పండుగ వాతావరణంలో



పుంగనూరు: పెన్షన్లు పంపిణీ చేస్తున్న ఎంపీపీ

పింఛన్లను పంపిణీ చేశారు. జేసీఎస్ కన్వీనర్ ముర్వత్ బాషా మాట్లాడారు. ఎంపీటీసీ పోకల చంద్ర, రెడ్డిఅహమ్మద్, సర్పంచ్ షకూర్, నాయకులు నాగరాజప్రసాద్, రాయల్ మోహన్, గంగయ్య, సదాశివరెడ్డి, దామోదర్‌రెడ్డి పాల్గొన్నారు.

రొంపిచెర్లలో..

రొంపిచెర్ల: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఎంపీపీ చిచ్చిలి పురుషోత్తం రెడ్డి పింఛన్లు పంపిణీ చేసి మాట్లాడారు. మండలంలో మారుమూల గ్రామాలకు సైతం తారు రోడ్లు, సీసీ రోడ్లు, వేశామని, తాగునీటి ట్యాంకులు నిర్మించామన్నారు. గత టీడీపీ పాలనలో మండలంలో పెన్షన్ల పంపిణీకి రూ.40 లక్షలు ఖర్చు చేస్తుండగా తమ ప్రభుత్వ పాలనలో రూ.1.38 కోట్లు ఇస్తున్నామన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రెడ్డీశ్వర్ రెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు హరినాథరెడ్డి, మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ ఇబ్రహీంఖాన్, ఎంపీడీఓ



పలమనేరు: పింఛన్లు పంపిణీ చేస్తున్న చైర్‌పర్సన్

రాజేంద్ర, వైస్ ఎంపీపీలు నూలు రెడ్డెప్ప, విజయశేఖర్, వైఎస్సార్ సీపీ నాయకులు కోటా వెంకటరమణ, నాగిరెడ్డి, యుగంధర్ రెడ్డి, అన్సర్‌బాషా, కరీముల్లా, రామనారాయణ రెడ్డి పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

కుప్పం: ప్రజలకు సంక్షేమ పథకాలు అందివ్వడమే ప్రభుత్వ లక్ష్యమని మున్సిపల్ చైర్మన్ డాక్టర్ సుధీర్ అన్నారు. జనవరి నుంచి నూతన పింఛన్లు, రూ.3 వేల పెరిగిన పింఛన్ల పంపిణీపై గురువారం మున్సిపల్ కార్యాలయంలో ఆయన వలంటీర్లకు సమావేశం నిర్వహించారు. కుప్పం మున్సిపాలిటీ పరిధిలో 4,300 మందికి పింఛన్ల రూపేణా నెలకు రూ.2కోట్లను ప్రభుత్వం ఇస్తోందన్నారు. పండుగ వాతావరణంలో పింఛన్లను పంపిణీ చేయాలని ఆదేశించారు. వందరోజులు వలంటీర్లు కష్టపడి పనిచేసి మళ్లీ జగన్‌మోహన్ రెడ్డి సీఎంగా, ఎమ్మెల్సీ భరత్‌ను కుప్పం ఎమ్మెల్యేగా గెలిపించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మునిసిపల్ వైస్ చైర్మన్ మునుస్వామి, స్థానిక కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

అందరి దీవెనలూ జగనన్నకే..

పలమనేరు: మూడువేల పింఛను పొందుతున్న అవ్వాతాతలు, వింతంతువులను పలుకరించినా.. సామీ జగనన్న చల్లగా ఉండాలయ్యా.. అంటూ దీవిస్తున్నారని పలమనేరు మున్సిపల్ చైర్‌పర్సన్ చాముండేశ్వరి పేర్కొన్నారు. పెరిగిన మూడువేల పింఛన్లను గురువారం ఆమె పట్టణంలో లబ్ధిదారులకు పట్టణ మాజీ కన్వీనర్ మండీసుధాతో కలసి పంపిణీ చేశారు. అలాగే ఆయా వార్డుల్లో కౌన్సిలర్లు పింఛన్లు పంపిణీ చేశారు. పాతపేట సచివాలయంలో చైర్‌పర్సన్ మాట్లాడారు. పట్టణంలో 4,749 కొత్త, పాత పింఛనుదారులకు రూ.14.26 కోట్లను ఇస్తున్నట్టు చెప్పారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

వి.కోట: ఇచ్చిన మాట ప్రకారం అవ్వాతాతలు, అక్కచెల్లెమ్మలకు పెంచిన రూ.3,000 పింఛన్లను ఇస్తున్న జగనన్నకు జీవితాంతం రుణపడి ఉంటామని లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేశారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. గురువారం వి.కోట పంచాయతీలో వార్డు సభ్యుడు ఖలీల్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు షమీమ్ బేగం, సుధాకర్ రెడ్డి, వలంటీర్లు పాల్గొన్నారు.



సదుం: పింఛన్లు పంపిణీ చేస్తున్న నాయకులు



పులిచెర్ల: మంగళంపేటలో..



రొంపిచెర్ల: పెన్షన్లు పంపిణీ చేస్తున్న ఎంపీపీ పురుషోత్తం రెడ్డి, జెడ్పీటీసీ రెడ్డీశ్వర్ రెడ్డి



కుప్పం: మాట్లాడుతున్న చైర్మన్ డాక్టర్ సుధీర్

తిరుపతికి వెళ్లి పింఛన్ ఇచ్చాడు



లబ్ధిదారురాలికి స్విమ్స్ ఆస్పత్రిలో పింఛను అందజేస్తున్న వలంటీర్ మనోజ్‌కుమార్

వి.కోట: తిరుపతి స్విమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితురాలికి వలంటీర్ వి.కోట నుంచి వెళ్లి పింఛను ఇచ్చాడు. మండలంలోని శివుని కుప్పం గ్రామానికి చెందిన కళ్యాణమ్మ అనారోగ్యంతో కొన్ని రోజులుగా స్విమ్స్‌లో చికిత్స పొందుతోంది. ఇది తెలుసుకున్న వలంటీర్ మనోజ్‌కుమార్ గురువారం తన సొంత ఖర్చులతో అక్కడికి వెళ్లి రూ.3,000 అందజేశాడు.

సంపూర్ణ పోషణ కిట్ల పంపిణీ



సంపూర్ణ పోషణ కిట్లను పంపిణీ చేస్తున్న జిల్లా కార్యదర్శి తమ్మిరెడ్డి

పెద్దపంజాణి: స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం సంపూర్ణ పోషణ సరుకులను గర్భిణులు, బాలింతలకు వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి తమ్మిరెడ్డి పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ, గర్భిణులు, బాలింతలు రక్తహీనత సమస్యను అధిగమించడానికి పోషకాహార విలువలతో కూడిన కిట్లను ప్రతి నెలా ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ఇస్తోందని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు క్రిష్టప్ప పాల్గొన్నారు.

క్రీడాకారులకు ఆటవస్తువులు..

పుంగనూరు: పట్టణంలోని విశ్రాంత డీఎస్పీ సుకుమార్‌బాబు క్రీడాకారులకు క్రికెట్ బ్యాట్లు, వాలీబాల్ కిట్లు పంపిణీ చేశారు. గురువారం వాల్మీకి మహర్షి సేవా సంఘం తరపున వీటిని అందజేశారు. వాల్మీకుల అభ్యున్నతికి తనవంతు కృషి చేస్తానన్నారు.

‘నవోదయ’కు ఎంపిక



నిఖిల్ నవనీత్

పుంగనూరు: పట్టణంలోని ఒక కోచింగ్ సెంటర్ విద్యార్థులు నిఖిల్, నవనీత్ నవోదయలో సీటు సంపాదించారు. గురువారం ఆ సెంటర్ కరస్పాండెంట్ వాసుదేవరెడ్డి తెలిపిన మేరకు..బైరెడ్డిపల్లెకు చెందిన రైతు గోపి కుమారుడు నవనీత్, అలాగే అన్నమయ్య జిల్లా రామసముద్రం మండలం పెద్దకురప్పల్లెకు చెందిన రైతు గణేష్ కుమారుడు నిఖిల్ 5వ తరగతి చదువుతూ నవోదయ శిక్షణ పొందారు. పరీక్షల్లో ఉత్తీర్ణులై సీటు పొందారు. విద్యార్థులను కరస్పాండెంట్, ప్రిన్సిపల్ ఎల్లమ్మ అభినందించారు.

శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయం

● జిల్లా ఎస్పీ రిశాంత్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎస్పీ రిశాంత్‌రెడ్డి

చౌడేపల్లె: ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయంగా ముందుకెళ్తామని, ఈ దిశగా ప్రజలు కూడా పోలీసులకు సహకరించాలని జిల్లా ఎస్పీ రిశాంత్‌రెడ్డి కోరారు. గురువారం చౌడేపల్లెలో సర్కిల్ కార్యాలయం, పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. రికార్డులను ఎస్పీ పరిశీలించిన అనంతరం మీడియాతో మాట్లాడారు. ఇటీవల కాలంలో సైబర్ నేరాలు అధికం అయ్యాయని, ప్రజలను మభ్యపెట్టి సైబర్ నేరగాళ్లు దొరికినంతా దోచుకుంటున్నారన్నారు. తెలియని వారికి, ఆధార్ కార్డులు, నంబర్లు, బ్యాంకు ఖాతా, పిన్ నంబర్లు చెప్పరాదన్నారు. సెల్ ఫోన్ చోరీకు గురైతే వెంటనే చాట్‌బాట్ నంబరు 9440900004కు సమాచారం ఇస్తే పోలీసులు ఫిర్యాదును స్వీకరించి, సెల్‌ఫోన్‌ను గుర్తించి బాధితులకు అప్పగిస్తారన్నారు. చౌడేపల్లెలో ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక సిబ్బందిని కేటాయిస్తామన్నారు. ఖాళీ అయిన ఎస్‌ఐ పోస్టును త్వరలో భర్తీ చేస్తామన్నారు. రాత్రి సమయాల్లో గస్తీ ముమ్మరం చేయడంతోపాటు సైబర్ నేరాలు, బ్యాడ్, గుడ్ టచ్, పల్లెల్లో పోలీసుల పల్లెనిద్ర కార్యక్రమంతో ప్రజల్లో చైతన్యం తేవడానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో పలమనేరు డీఎస్పీ సుధాకర్‌రెడ్డి, సీఐ కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

వేగవంతంగా జగనన్న లేఅవుట్ పనులు



జగనన్న లే అవుట్‌లో పనులను పరిశీలిస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు

రామకుప్పం: మండలంలో జగనన్న లే అవుట్ పనులు వేగవంతంగా చేస్తున్నారు.వీర్నమల, బల్ల, కెంచనబళ్ళ, సింగసముద్రం, రాజుపేట, కొల్లుపల్లె పంచాయతీలలో నూతనంగా జగనన్న లే అవుట్ నిర్మాణ పనులు చేస్తున్నారు. పెద్దతండా పరిధిలో చేస్తున్న లేఅవుట్ పనులను గురువారం మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ విజలాపురం బాబురెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు నితిన్ రెడ్డి, స్థానిక సర్పంచ్ మోహన్ నాయక్ పరిశీలించారు. కార్యక్రమంలో నేతలు మురుగేష్, రవినాయక్, భాస్కర్ నాయక్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

యానాది కాలనీకి సీసీ రోడ్డు మంజూరు



జేసీబీతో రోడ్డు పనులు చేయిస్తున్న సర్పంచ్

పెద్దపంజాణి: పలమనేరు ఎమ్మెల్యే వెంకటేగౌడ చొరవతో మండలంలోని కోగిలేరు యానాది కాలనీకి సిమెంటు రోడ్డు మంజూరైనట్లు స్థానిక సర్పంచ్ రమేష్ బాబు తెలిపారు. గ్రామంలో ఇటీవల గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజల విజ్ఞప్తిపై ఎమ్మెల్యే స్పందించారు. మెయిన్ రోడ్డు నుంచి కాలనీ వరకూ సీసీ రోడ్డు వేయడానికి జీజీఎంపీ నిధులు రూ.30 లక్షలు మంజూరు చేశారు. గురువారం స్థానిక నాయకులు సీసీ రోడ్డు నిర్మాణానికి జేసీబీతో మట్టి పనులు ప్రారంభించారు. త్వరలోనే రోడ్డు పనులు పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు శివశంకర్ రెడ్డి, వెంకటరెడ్డి, సుబ్రమణ్యం, కిట్టన్న, వలంటీర్లు లోకేష్, లోకేశ్వరి పాల్గొన్నారు.

7న ఉచిత కంటి వైద్యశిబిరం

చౌడేపల్లె: స్థానిక జెడ్పీ హైస్కూల్ ఆవరణలో ఈ నెల7న ఆదివారం చౌడేపల్లె ఓల్డ్ స్టూడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు ఆ అసోసియేషన్ అధ్యక్షుడు గిరినాథ్ ప్రకాష్ తెలిపారు. హాజరయ్యే రోగులు ఓల్డ్ స్టూడెంట్స్ వద్ద గుర్తింపు కార్డులు పొందాలన్నారు. కంటికు సంబంధించి అన్ని సమస్యలకూ బెంగళూరులో శంకర కంటి ఆసుపత్రి ప్రముఖ డాక్టర్లు వైద్య పరీక్షలు చేసి, అవసరమైన వారిని శస్త్రచికిత్సకు ఎంపిక చేస్తారన్నారు. బెంగళూరులో ఆపరేషన్ల అనంతరం తిరిగి చౌడేపల్లెకు చేర్చనున్నట్లు చెప్పారు. శిబిరానికి వచ్చే రోగులు తమ వెంట రేషన్, ఓటరు, ఆధార్ కార్డుల జెరాక్స్, కుటుంబ సభ్యుల ఫోన్ నంబర్‌ను తేవాలన్నారు.

విగ్రహావిష్కరణ వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న బాస్ నేతలు

పలమనేరు: పట్టణంలో ఈనెల 7న ఆదివారం బలిజ సంఘం ఆధ్వర్యంలో శ్రీకృష్ణదేవరాయల కాంస్య విగ్రహావిష్కరణ కార్యక్రమానికి సంబంధించి వాల్‌పోస్టర్లను పలమనేరు బాస్ నిర్వాహకులు గురువారం ఓ ప్రైవేటు కళ్యాణమండపంలో ఆవిష్కరించారు. బలిజ సేవాసమితి నేతలు సుధాకర్, ఆకుల గజేంద్ర,ఏకే కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

హిందూ శాంతియుత ర్యాలీ



మాట్లాడుతున్న రాధా మనోహర్‌దాస్

పుంగనూరు: హిందూ చైతన్య ధర్మ ప్రచార సేవక్ రాధా మనోహర్ దాస్ ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం పట్టణంలో శాంతియుత ర్యాలీ నిర్వహించారు. చాముండేశ్వరి ఆలయం వద్ద ఆధ్యాత్మికోపన్యాసం ఇచ్చారు. కార్యక్రమంలో హిందూ జాగరణ సమితి సభ్యులు పరమేష్, త్రిమూర్తిరెడ్డి, వెంకటేష్, సతీష్ కుమార్‌రాజు, మహేష్, గంగాధర తదితరులు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

పులిచెర్ల(కల్లూరు): కర్ణాటక మద్యం విక్రేతను పోలీసులు అరెస్ట్ చేశారు. కల్లూరు ఎస్సై రవిప్రకాష్ రెడ్డి తెలిపిన వివరాలు.. మండలంలోని రాయవారిపల్లె పంచాయతీ గెలసంవారిపల్లెకు చెందిన జనార్ధననాయుడు గురువారం గెలసంవారిపల్లె బస్టాపు వద్ద కర్ణాటకకు ఎనిమిది ఫుల్ మద్యం బాటిళ్లను అమ్ముతుండగా సీజ్ చేసి, అతడిని అరెస్ట్ చేశారు.

జ్వరాలతో పశువులు మృతి

వి.కోట: జ్వరాల బారిన పడి పాడి ఆవు మృతి చెందిన సంఘటన గురువారం దొడ్డిపల్లెలో చోటుచేసుకుంది. వాతావరణ మార్పుల కారణంగా గ్రామంలోని పలు పశువులు జ్వరాలతో బాధపడుతున్నాయని, ఇప్పటికే మూడు ఆవులు మరణించాయని, అధికారులు స్పందించి పశు వైద్య శిబిరం ఏర్పాటు చేసి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

‘మధ్యాహ్న భోజనం’ తనిఖీ



భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ అబ్దుల్

పెద్దపంజాణి: మండలంలోని రాజుపల్లె జెడ్పీ హైస్కూల్లో గురువారం మధ్యాహ్న భోజనాన్ని ఎంపీడీఓ అబ్దుల్ రహీం తనిఖీ చేశారు. రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. మెనూ పాటించాలని, నాణ్యతతో కూడిన భోజనం పెట్టాలని వంట నిర్వాహకులను ఆదేశించారు. కార్యక్రమంలో పెద్దపంజాణి వైద్యాధికారి మురళి, పంచాయతీ సెక్రటరీ శ్రీనివాసులు, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి తమ్మిరెడ్డి, పార్టీ నాయకులు శంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉత్సాహంగా ‘ఆడుదాం ఆంధ్రా’



కీలపట్లలో ప్రజాప్రతినిధులు, నాయకులు ప్రదానం చేసిన షీల్డ్స్‌ను చూపుతున్న విజేతలు



కొత్తపల్లెలో కబడ్డీ పోటీలను ప్రారంభిస్తున్న సర్పంచ్ గిరిరాజారెడ్డి

● 9 సచివాలయాల పరిధిలో పోటీలు

గంగవరం: మండలంలోని 9 సచివాలయాల పరిధిలో గురువారం ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు నిర్వహించారు. దండపల్లెలో 2 కబడ్డీ మ్యాచ్‌లు, జీడిమాకులపల్లెలో 10 మ్యాచ్‌లు, కలగటూరులో 1, కీలపట్ల, కొత్తపల్లెలో మూడేసి మ్యాచ్‌లు, మేలుమాయిలో 2 మ్యాచ్‌లు పూర్తయ్యాయి. అలాగే గంగవరం– 1, 2 సచివాలయాల పరిధిలో బ్యాడ్మింటన్, పసుపత్తూరులో ఖో–ఖో పోటీలు నిర్వహించారు. కొత్తపల్లెలో క్రీడా పోటీలను సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు గిరిరాజారెడ్డి ప్రారంభించారు. కీలపట్ల సచివాలయ స్థాయిలో విజేతలకు ప్రజాప్రతినిధులు, నాయకులు షీల్డ్‌లు ప్రదానం చేశారు.

మున్సిపల్ కార్మికుల ఆందోళన

పలమనేరు: మున్సిపల్ కార్మికులు గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. తమను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు నరసింహులు, ఓబులరాజు, కార్మికులు పాల్గొన్నారు.

సదుంలో వర్షం

సదుం: మండలంలో గురువారం సాయంత్రం ఓ మోస్తరు వర్షం కురిసింది. ఉదయం నుంచి ఆకాశం మేఘావృతంగా ఉన్నా హఠాత్తుగా వర్షం కురవడంతో రైతులు కొంతవరకు ఇబ్బందులు పడ్డారు.